సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 27 । నవంబర్ । 2023



‘కొడవలూరు’కు విశేష కీర్తి
మహాసేనోదయం కావ్య రచనతో కవి కొడవలూరు రామచంద్రరాజుకు విశేష కీర్తి లభించిందని విశ్రాంత తెలుగు పండితులు ఏసీ దస్తగిరి పేర్కొన్నారు. -8లో



హోరాహోరీగా జోనల్ మ్యాచ్‌లు
కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. -8లో

గరిష్టం/కనిష్టం
31.6/22.6

వాతావరణం
జిల్లాలో ఆదివారం 22.6 - 31.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీ-డ్యాప్ సౌజన్యంతో రాయలసీమ జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు కడపలో ఉచిత శిక్షణతో కూడిన ఉపాధిని కల్పించనున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాల వ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమెర్జెన్సీ, మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 90630 82227 నంబరులో సంప్రదించాలన్నారు.

మల్లయ్యకొండకు నాలుగు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు కార్తీకమాసం పురస్కరించుకుని నాలుగు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 27, వచ్చే నెల 4, 11 తేదీల్లో తంబళ్లపల్లె మల్లయ్యకొండకు బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లె నుంచి ఉదయం 5.30, 6.30, 7.30లకు బయలుదేరి తంబళ్లపల్లె రాగామాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ తిరుగుతాయన్నారు. మరొక బస్సు ఉదయం 5 గంటకు నేరుగా మల్లయ్యకొండకు, మదనపల్లెకు తిరుగుతుందన్నారు.

కల్యాణం.. కమనీయం



శ్రీ భద్రకాళీ సమేతుడి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు, దాతలు

రాయచోటిటౌన్ : శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలలో కార్తీక దీపారాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలోఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి, శంకరయ్య స్వామి, రాచరాయ యోగీ స్వామి వారి ఆధ్వరంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలి వచ్చారు. అఘోరలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శివాలయంలో కార్తీక దీపాల వేడుకలలో అర్చన్ సీఏ సుధాకర్‌రెడ్డి దంపతులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

రేపు సర్టిఫికెట్లతో హాజరుకావాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగస్తుల పిల్లలకు కారుణ్యనియామకాలు చేపట్టనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1.1.2020 నుంచి 31.12.2022 వరకు చనిపోయిన వారి పిల్లలు అర్హులని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ మంగళవారం ఉదయం 10 గంటకు కలెక్టరేట్ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న కేడెట్స్‌ను అభినందిస్తున్న సీఓ, ఎన్‌సీసీ అధికారులు

వైవీయూ: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా కోరారు. కడప ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో చివరిరోజు ఆదివారం ముగింపు కార్యక్రమం, ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేసినవారవుతామన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య మాట్లాడారు. అనంతరం రక్తదానం చేసిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జేబీవీఎస్ ప్రిజర్వర్ స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు అశోక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారి రమేష్, రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషలాఫీసర్ శివశంకర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు డా. మహేష్, పొన్నతోట రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు మెరుగైన విద్యుత్

సమాజ శ్రేయస్సులో విద్యుత్ రంగం పాత్ర కీలకం. ఈ రంగం బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్ (ఆర్‌డీఎస్ఎస్)ను అమలులోకి తీసుకురానుంది. డిజిటలైజేషన్, నెట్‌వర్క్ మెరుగుదల ద్వారా విద్యుత్ సరఫరాలో నాణ్యత, విశ్వసనీయత పెంపొందించడమే దీని లక్ష్యం ప్రధాన లక్ష్యం.



- రూ.950కోట్లతో వేగంగా ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులు
- విద్యుత్ సరఫరాలో నాణ్యత, విశ్వనీతయ పెంచడమే లక్ష్యం



విద్యుత్ శాఖ కార్యాలయం

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.11000కోట్ల పెట్టుబడితో ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని అమలు చేస్తోంది.ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు రూ.3.03లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు. మొత్తం పెట్టుబడిలో 60 శాతం కేంద్రం నుంచి గ్రాంట్‌గా రానుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రూ.950కోట్లతో పనులు జరుగుతున్నాయి.

- ప్రస్తుత పంపిణీ వ్యవస్థలోని లోపాల వల్ల విద్యుత్ శాఖకు నష్టాలు వస్తున్నాయి. డిస్కంల ద్వారా కొనుగోలు చేసిన విద్యుత్ ఖర్చుకు, వినియోగదారుల నుంచి వచ్చే రాబడికి మధ్య అంతరం ఎక్కువ ఉండటం వల్ల నష్టాలు వస్తున్నాయి. విద్యుత్ చౌర్యం, నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లకు 2025 డిసెంబర్ నాటికి స్మార్టు మీటర్లు ఏర్పాటు చేసే దిశగా పనులు సాగుతున్నాయి. స్మార్టు మీటర్లు ఏర్పాటైతే ప్రతినెలా రీడింగ్ నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. అంతా ఆన్‌లైన్‌లోనే తెలిసిపోతుంది.

- 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వంద కుటుంబాల్లో ఒకరు ఏసీ వాడుతున్నట్లు లెక్కలున్నాయి. రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో ఏసీల వాడకం ఎక్కువై, విద్యుత్ తలసరి వినియోగం పెరిగే అవకాశం ఉంది. ఆ భారం విద్యుత్ శాఖపై పడకుండా రాబోయే 20 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడానికి ఆర్‌డీఎస్ఎస్ స్కీం ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ పథకం అమలులో భాగంగా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు సబ్ స్టేషన్ స్థాయి నుంచి 33కేవీ లైన్లను విభజిస్తున్నారు, ప్రతి గ్రామానికి త్రీ ఫేజ్ కనెక్షన్లు ఇవ్వడానికి వీలుగా 5 వైర్ లైన్లు లాగుతున్నారు. రోడ్ల మధ్య ఉన్న స్తంభాలు, దెబ్బతిన్న స్తంభాలను మారుస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ పనులు పూర్తి చేసేందుకు విద్యుత్‌శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో గృహ సర్వీసులు :	10,50,720
హెచ్‌టీ కనెక్షన్లు :	416
డీటీఆర్ సర్వీసులు :	1,34,403
11 కేవీ ఫీడర్లు :	1,148
33/11 కేవీ సబ్‌స్టేషన్లు :	302

త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు



రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డీఎస్ఎస్) పూర్తిగా అమలైతే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పల్లెల్లో 24 గంటల విద్యుత్ సరఫరా, కమర్షియల్, ఇండస్ట్రియల్‌కు అవసరమయ్యే 3 ఫేజ్ మీటర్లు, కనెక్షన్లు అందుబాటులోకి వస్తాయి. పాడైన విద్యుత్ లైన్లు, స్తంభాలను పూర్తిగా మారుస్తాం. ఇప్పటికి 600 ఫీడర్లు మార్చడం జరిగింది. త్వరగా పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం.
- ఎస్. రమణ, పర్యవేక్షక ఇంజినీరు, ఏపీఎస్పీడీసీఎల్. కడప సర్కిల్

పట్టణాలకు దీటుగా తయారుకానున్న పల్లెలు

ఇదివరకు తాగునీటి వనరులు ఎక్కడైతే పుష్కలంగా ఉంటాయో అక్కడే పట్టణాలు, గ్రామాలు ఏర్పడుతూ వచ్చాయి. ఇటీవలి కాలంలో ఆ పరిస్థితి మారిపోయింది. ఎక్కడైతే పూర్తిగా విద్యుదీకరణ జరిగి ఉంటుందో ఆ ప్రదేశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. విద్యుత్ రంగంలో ఆర్‌డీఎస్ఎస్ స్కీం పూర్తిగా అమలైతే గ్రామీణ ప్రాంతాలు పట్టణాలకు దీటుగా తయారయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ గ్రామాల్లో 24 గంటల విద్యుత్, 3 ఫేజ్ కనెక్షన్లు అందుబాటులో లేవు. ఫలితంగా గ్రామాల్లో వ్యాపార కేంద్రాలు, కమర్షియల్ షాపులు, పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం లేదు. మౌలిక సదుపాయాల కొరత, ఉపాధి దొరకనందున చాలామంది పట్టణాలకు వలస పోతున్నారు. ఆర్‌డీఎస్ఎస్ స్కీం ద్వారా గ్రామాల్లో 24 గంటల విద్యుత్ సరఫరాతోపాటు 3ఫేజ్ కనెక్షన్లు వీలుగా ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. దీనివల్ల గ్రామాల్లోనే ఎక్కడికక్కడ పరిశ్రమలు, వ్యాపార కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు కూడా అక్కడే లభిస్తాయి. దీనివల్ల పట్టణాలకు వెళ్లే ఆవశ్యకత తగ్గుతుందని అంచనా.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత !

- జేసీ గణేష్‌కుమార్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: భారత రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అన్నారు. ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి జేసీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పందన హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతిని కాంక్షించి రచించిన రాజ్యాంగాన్ని 26 నవంబర్ 1949న జాతికి అంకితం చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్న విషయాన్ని అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే రోజును జాతీయ న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవాలుగా కూడా నిర్వహించుకున్నామని తెలిపారు. త్యాగం, కృషి, సడలని పట్టుదల, నిజాయితీ, నిబద్ధత, చిత్తశుద్ధి, క్రమశిక్షణ, అకుంఠిత దీక్షాదక్షతలకు అంబేడ్కర్ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. డీఆర్వో గంగాధర్ గౌడ్ భారత రాజ్యాంగంలోని పీఠికను చదివి వినిపించారు. అనంతరం భారతీయ జీవన గమనాన్ని ప్రతిబింబించే విలువైన సాధనం రాజ్యాంగం అని ఆ గ్రంథాన్ని, న్యాయ చట్టాల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కౌసర్ భాను, ప్రత్యూష, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం..జ్వాలాతోరణం

వల్లూరు: పుష్పగిరిలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా పూజలు జరిగాయి. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాములకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో దేవస్థానం ఆధ్వర్యంలో జ్వాలాతోరణాన్ని ఏర్పాటు చేశారు. జ్వాలా తోరణాన్ని మైదుకూరు శాసన సభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనయుడు నాగిరెడ్డి దంపతులు వెలిగించారు. వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణం ,నదిలో దీపాలు వెలిగించారు. శ్రీ చెన్న కేశవ స్వామి, సంతాన మల్లేశ్వర స్వామి, శ్రీ కామాక్షీ వైద్య నాథ స్వాములను దర్శించుకున్నారు. పుష్పగిరి క్షేత్రం శివ నామ స్మరణతో మార్మోగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు మురళీ మోహన్ రెడ్డి, సబ్బారెడ్డి పాల్గొన్నారు. ఆశా రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ చెన్న కేశవ

- పినాకినీ నదిలో పంచ నదీ హారతిని ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా నదిలో చిత్రించిన పరమ శివుని చిత్రం అందరినీ ఆకట్టుకుంది. భక్తులకు ఫౌండేషన్ ఛైర్మెన్ నెమలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో ఉచితంగా బస్సు సౌకర్యాన్ని కల్పించారు.



పుష్పగిరి చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణలో జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న భక్తులు

పరిమళించిన ఆధ్యాత్మిక గంధం



గంధం, చాదర్ సమర్పిస్తున్న పీఠాధిపతి, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పెద్దదర్గా ఆవరణలో భక్తుల సందడి

గంధం సమర్పించిన పీఠాధిపతి

కడప కల్చరల్ : ఆ ప్రాంగణమంతా జనసందోహం ..ప్రతి రోడ్డులోనూ దాదాపు 100 మీటర్లపాటు కిక్కిరిసిన జనం..అంతటా ఆధ్యాత్మిక సుగంధం.....అందరి మనసుల నిండా భక్తి..కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో ప్రధానంగా భావించే ఘట్టాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. హజరత్ సూఫీ సర్ మస్తాని చిల్లాకష్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తన నివాసం నుంచి అలంకరించిన గంధం కలశంతో ఫకీర్ల మేళతాళాలు, సాహస విన్యాసాల మధ్య ఊరేగింపుగా దర్గాలోని గురువుల మజార్ వద్దకు తరలి వెళ్లారు. గంధం సమర్పించి ఫాతెహా నిర్వహించారు. ముషాయిరా హాలులో దర్గా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంస్థల వార్షిక నివేదికతోపాటు అమీన్ ఎడ్యుకేషనల్ ట్రస్టు విశేషాలను, విజయాలను నిర్వాహకులు పీఠాధిపతికి సమర్పించారు. ఈ సందర్భంగా అమీన్ ఐటీఐలో ప్రతిభ చూపిన విద్యార్థుల గురించి ఐటీఐ ప్రతినిధులు వివరించారు. వారికి ఐదుగురికి ప్రశాంత పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

దీక్షలో మలంగ్‌షా

ఈ సందర్భంగా మలంగ్‌షాను పీఠాధిపతి దీక్ష వహింపజేశారు. దర్గా నుంచి కడపలోని ముఖ్య కూడళ్ల మీదుగా వెళ్లిన మలంగ్‌షా, అనుచర బృందం నాగరాజుపేటలోని బాదుల్లాసాహెబ్ మకాన్‌కు చేరింది. మకాన్ నిర్వాహకులు, స్థానిక భక్తులు వారిని స్వాగతించారు. సాయంత్రం ఆ బృందం ఊరేగింపుగా తిరిగి దర్గాకు చేరుకుంది. రాత్రి మలంగ్‌షా దర్గా ఆవరణంలోని పీర్లచావిడిలో దీక్ష వహించారు. దర్గా పీఠాధిపతి స్వయంగా వెళ్లి ఆయనకు సంప్రదాయబద్ధంగా దీక్ష వహింపజేశారు.

భక్తులకు ఏర్పాట్లు

గంధం ఉత్సవానికి దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు వారందరికీ వసతి, భోజన సౌకర్యం కల్పించారు. దుకాణాల వద్ద కూడా జనం సందడి కనిపించింది.

మానసిక వైద్యంతో ఇండ్లకు ఖ్యాతి

- వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించడం అభినందనీయం
- డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అభినందన సభలో వక్తలు





మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు, ఇండ్ల రామసుబ్బారెడ్డి దంపతులను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే

కడప రూరల్ : మానసిక వైద్యంలో విశేషంగా కృషి చేసి దేశ వ్యాప్తంగా ప్రముఖ వైద్యులుగా గుర్తింపు పొందిన వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి సేవలు అభినందనీయం. ఆయన మానసిక రోగులకు అందించిన సేవలకు గుర్తుగా వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించడం ప్రశంసనీయమని వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో అభినందనసభను నిర్వహించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.బాలిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ జిల్లాకు చెందిన సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి వైద్య రంగంలో రాణించడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఆయన లక్షలాది మంది మానసిక రోగులకు వైద్య సేవలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని ప్రశంసించారు. ఆయన రచయితగా కూడా రాణించడం అసమాన్య విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్న విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన ప్రారంభంలో కడపలో రాష్ట్ర స్థాయిలో సైక్రియాటిస్టుల సదస్సు జరిగిందన్నారు. ఈ సదస్సుకు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డితోపాటు తాను ముఖ్య అతిథిగా హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ ఒక మానసిక వైద్యశాల ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారన్నారు. ఈ అంశాన్ని తాము సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి ఇక్కడ సైక్రియాటిస్టు ఆస్పత్రిని కేటాయించారన్నారు. ఆ ఆస్పత్రి సీఎం చేతుల మీదుగా డిసెంబరులో ప్రారంభం కాబోతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు మానసిక వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం హైదరాబాదు తదితరప్రాంతాలకు వెళ్లేవారన్నారు. ఇప్పుడు కడప కేంద్రంగా మానసిక వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్స లభించనుందన్నారు. కాగా, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి తాను చేస్తున్న వైద్య సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ అవార్డును కేటాయించాలన్నారు. ఈ అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతామన్నారు.

- మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, తాను బాల్య మిత్రులమని గుర్తు చేశారు. మైదుకూరు నియోజకవర్గం గుడిపాడు గ్రామానికి చెందిన ఆయన వైద్య రంగంలో దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించడం ప్రశంసనీయమన్నారు. ఈయనకు పద్మశ్రీ అవార్డును కేటాయించాలన్నారు. అనంతరం సన్మాన గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తాను వైఎస్సార్ జిల్లా గుడిపాడు గ్రామానికి చెందిన వాడినని తెలిపారు. ఈ జిల్లాలో తనకు బంధువులు ఉండగా, విజయవాడలో విశేషంగా మిత్రులు ఉన్నట్లు తెలిపారు. 40 ఏళ్ల కిందట వైఎస్సార్ జిల్లా నుంచి అందులోనూ రాయలసీమ ప్రాంతం నుంచి విజయవాడకు వెళ్లి మానసిక వైద్యశాలను ఏర్పాటు చేయడం అరుదైన విషయమన్నారు. తన వైద్య సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అరుదైన వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు.అనంతరం ఆహ్వానసంఘం ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, రాధారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. అలాగే పలువురు ప్రముఖులు ఆ దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నగర ప్రముఖులు గానుగపెంట హనుమంతరావు, జింకా సుబ్రమణ్యం, ఆదినారాయణరెడ్డి, లెక్కల కొండారెడ్డి, మూల మల్లికార్జునరెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ భాస్కర్‌రెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



దైవ సందేశం అందజేస్తున్న సుధీర్

కడప కోటిరెడ్డిసర్కిల్: క్రీస్తు మార్గం సర్వమానవాళికి అనుసరణీయమని రెడీమర్ పరిచర్య వర్తమానికులు డాక్టర్ భవనాశి సుదీర్ తెలిపారు. ఆదివారం స్థానిక నేక్ నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభువు మానవాళి క్షేమం కోసం భూలోకానికి వచ్చారన్నారు. బైబిలో బోధించినట్లుగా ఆయన ఆలోచన కర్తగా రావడం జరిగిందని, ఆయన పేరే ఆలోచన కర్తఅని తెలిపారు. మనిషి వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని గురించి ఆలోచించి అడిగిన ప్రతి ఒక్కరికీ ఆశీర్వాదాలు, దీవెనలు ఇచ్చే దేవుడని తెలిపారు. శాంతిమార్గాలను చూపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కోయర్ బృందం భక్తిగీతాలను ఆలపించింది. కార్యక్రమంలో సిస్టర్ రెజీనా, రొనాల్డ్, పాస్టర్లు ప్రమోద్, పుష్పరాజు, అంజలబాబు, శేషం ప్రసాద్, కేపీ రొనాల్డ్, మేరీ సుందరేషన్, రమేష్, సూరి, నాగేంద్ర, అనిల్, రంజిత్, సత్యరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



స్తుతి గీతాలు ఆలపిస్తున్న కోయర్ బృందం

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన కానగల నాగభూషణం



నాగభూషణం (ఫైల్)

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని మామిళ్ళపల్లి వద్ద 16వ డివిజన్ పరిధిలో గల చంద్ర ప్రతాప్ రెడ్డి కాలనీకి చెందిన కానగల నాగభూషణం(61) అనే వ్యక్తిని శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. సీకే దిన్నె ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపిన సమాచారం మేరకు... రిటైర్డ్ ఎల్ఐసి ఉద్యోగి నాగభూషణం తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు తలపై బలంగా కొట్టారు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మామిళ్లపల్లి వీఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు. కాగా, మృతుడు భార్యా పిల్లలకు దూరంగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రామాపురం: మండలంలోని రాచపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంపీయూపీ పాఠశాల వద్ద ఈనెల 19న బైకు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో మొరం వెంకట్రామిరెడ్డి అనే వ్యక్తి గాయపడ్డాడు. కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

హోరాహోరీగా అండర్-23 జోనల్ మ్యాచ్‌లు

- ఆధిక్యంలో సెంట్రల్ జోన్
- సెంచరీ సాధించిన ధరణినాయుడు



తలపడుతున్న నార్త్‌జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో రెండోరోజు ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో 82 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు 92.2 ఓవర్లలో 362 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి. వంశీకృష్ణ 69 పరుగులు, బి. యోగానంద 65 పరుగులు, ఇ.ధరణినాయుడు 188 బంతుల్లో 20 ఫోర్లు, 2 సిక్సర్లతో 133 పరుగులతో రాణించారు. సెంట్రల్ జోన్ బౌలర్లు వెంకటసుమిత్ 3, భువనేశ్వర్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 13.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 26 పరుగులు చేసింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 14 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాగా సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 374 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ జట్టు 48 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో 162 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నార్త్‌జోన్ జట్టు 59.3 ఓవర్లలో 272 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రవికిరణ్ 97 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు చెన్నారెడ్డి 4, జానీబాషా 5 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 137 పరుగులు చేశారు. జట్టులోని రేవంత్‌రెడ్డి 63 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాగా రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.



133 పరుగులు చేసిన సౌత్‌జోన్ బ్యాట్స్‌మన్ ధరణినాయుడు

ఓపీఎస్ అమలు చేసేవారికే మద్దతు

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసే వారికే తమ మద్దతు అని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో రీజనల్ కన్వీనర్ సలీం అధ్యక్షతన ఆదివారం ఎస్టీయూ రీజనల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల ప్రజలకు సేవ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత వారి జీవితాలకు భద్రత కల్పించే పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ఏ పరిస్థితుల్లోనూ జీపీఎస్‌ను అంగీకరించబోమన్నారు. మన కంటే చిన్న రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, పంజాబ్, రాజస్థాన్, ఝార్ఖండ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేశాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలగంగిరెడ్డి, గురుకుమార్, ఇలియాస్ బాషా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, స్టేట్ కౌన్సిలర్లు రషీద్ ఖాన్, శ్రీను, సంజీవరెడ్డి, ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు అర్బన్, రూరల్, రాజుపాళెం, చాపాడు మండలాల శాఖలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ (23) అనే యువకుడు మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ పుల్లన్న తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన వెంకటేష్ స్థానిక ఇటుకల బట్టీలోకి పనికి వెళుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం వెంకటేష్ బైక్‌పై జమ్మలమడుగు బైపాస్ రోడ్డు మీదుగా ఈశ్వర్ రెడ్డినగర్‌కు వెళుతుండగా.. ఈ క్రమంలోనే బైక్‌పై పెన్నానగర్‌కు చెందిన తల్లీకొడుకులు నాగరత్నమ్మ, కిరణ్‌కుమార్ వెళుతున్నారు. తల్లీకొడుకులను వెనుకవైపు నుంచి వెంకటేష్ ఢీకొన్నాడు. దీంతో రెండు బైక్‌లు కిందపడ్డాయి. వెంకటేష్‌కు తీవ్రగాయాలు కావడంతో ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన తల్లీకొడుకులు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎస్‌యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో జనవరి 7,8 తేదీలలో జరగనున్న రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. ఇందుకు సంబంధించిన లోగోను ఆదివారం కడప జాప్ కార్యాలయంలో డాక్టర్ ఓబుల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధితోపాటు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, వైఎస్సార్, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు జిల్లాల అధ్యక్షులు ప్రశాంత్, క్రిష్టారెడ్డి, భీమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా



మృతి చెందిన తిప్పలూరు వెంకటసుబ్బయ్య

లింగాల : లింగాల మండలం దొండ్లవాగు క్రాస్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు గ్రామానికి చెందిన తిప్పలూరు వెంకటసుబ్బయ్య (38) అనే వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ ప్రభాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకట సుబ్బయ్య సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామంలో విందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పులివెందులకు బయలుదేరాడు. సింహాద్రిపురం మండలం నంద్యాలంపల్లెకు చెందిన వి.సోమశేఖర్‌రెడ్డి, ఆయన పిన్నమ్మ రామతులశమ్మలు ద్విచక్ర వాహనంలో పులివెందుల నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో తిప్పలూరు వెంకట సుబ్బయ్య కారు బోల్తా పడింది. ఈ ఘటనలో తిప్పలూరు వెంకటసుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ద్విచక్ర వాహన చోదకుడు సోమశేఖర్‌రెడ్డి, రామతులమ్మలు గాయపడ్డారని ఏఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడిని పులివెందుల ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. అలాగే సోమశేఖర్‌రెడ్డి పులివెందుల ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నాడని తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

విద్యాబోధన బాగుంది



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చాలా బాగుంది. అందుకే ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పుతున్నారు. నేను ఎల్ఐసీ కార్యాలయంలో అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నా. నా కుమార్తె లావణ్యను ప్రైవేటు పాఠశాల నుంచి వైఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో చేర్పించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందాయి. విద్యాప్రమాణాలు మెరుగుపడటంతో విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

- ఎం.నరసింహులు, విద్యార్థిని తండ్రి, ప్రొద్దుటూరు

సొంత ఇల్లు నిర్మించుకుంటున్నాం



అసలే మాది పేద కుటుంబం. పదేళ్ల క్రితం నా భర్త బి. అబ్దుల్ రషీద్ మరణించాడు. అప్పటి నుంచి మేము బాడుగ ఇంట్లో ఉంటు కాలం గడుపుతున్నాం. నా కుమారుడు మార్కెట్లో కూలి పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జగనన్న ప్రభుత్వం వచ్చాక వలంటీర్ సూచన మేరకు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నాం. స్థలం మంజూరు కావడంతో ఇంటి నిర్మాణం మొదలుపెట్టాం.

- మహబూబ్‌బీ, వెంకటేశ్వర కాలనీ, జమ్మలమడుగు

ఇంటి వద్దకే కుల ధ్రువీకరణ పత్రాలు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎన్‌బీ పత్రాలు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వలంటీర్ తెచ్చి ఇచ్చారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. అయినా పని అయ్యేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మార్పులతో రాష్ట్రంలో మంచి పరిపాలన కొనసాగుతోంది.

- మహేశ్వరి బి. కొట్టాలపల్లె గ్రామం, కొండాపురం మండలం

ఐక్యతతోనే కురుబల సమస్యల పరిష్కారం



కురుబ సంఘం ర్యాలీలో పాల్గొన్న హిందుపురం ఎంపీ గోరంట్ల మాధవ్

పులివెందుల / రూరల్ : ఐకమత్యంతోనే కురుబల సమ్యలను పరిష్కరించుకుందామని హిందుపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం కురవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకనకదాస్ జయంతోత్సవాల సందర్భంగా పూల అంగళ్ల సర్కిల్ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. శ్రీకనకదాస్ చిత్ర పటాన్ని రథంపై ఊరేగించారు. అనంతరం ఎస్ఎంబీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో కురవ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కురుబ కులస్థులు అధికంగా ఉన్నారన్నారు. ఆర్థికంగా బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు చదువుకోవాలన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పిల్లలు బాగా చదువుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు– నేడు పథకం ద్వారా పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో పెనుకొండ మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడు లింగ ప్రసాద్, పులివెందుల తాలుకా కురవ సంఘం నాయకులు లక్ష్మినారాయణ, ప్రసాద్, చంద్ర, హరి, మహేష్, గంగాధర, హరీష్, బండయ్య, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

2024లో జగన్ జైత్రయాత్రను ఏశక్తి ఆపలేదు

పులివెందుల రూరల్: 2024లో జరిగే ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జైత్రయాత్రను ఏశక్తి ఆపలేదని, జగన్‌ను ఓడించడం ఎవరి తరం కాదని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం ఆయన పులివెందులలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపొందడం తథ్యమన్నారు. 2019 ఎన్నికల్లో కురుబ కులస్థులకు ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి మంత్రి పదవి కూడా ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికలలో కూడా కురవ కులస్థులకు ఆరు సీట్లు ఇచ్చే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు హయాంలో కురవ కులస్థులకు ఒక సీటు మాత్రమే ఇచ్చే వారని అది కూడా గెలవకుండా ఉండే సీటు ఇచ్చే వారన్నారు. కురుబలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలోని కురవ కులస్థులందరూ వైఎస్సార్ పార్టీకి అండగా ఉండాలని కోరారు.

రాష్ట్రస్థాయి కుంగ్–ఫూ
పోటీలు నిర్వహించడం అభినందనీయం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయి కుంగ్–ఫూ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఏపీ స్టేట్ ఓపెన్ జేకేడీ కుంగ్–ఫూ పోటీలు ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో బహుమతుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మనిషి ఆత్మ రక్షణతోపాటు శారీరక, మానసిక వికాసానికి కుంగ్‌ఫూ చాలా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కిరెడ్డి పవన్ రెడ్డి, జార్జికారొనేషన్ క్లబ్ కార్యదర్శి గంగిరెడ్డి, జగ్గిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలువైన వారసత్వ సంపదకు నిలయం మన జిల్లా



మాట్లాడుతున్న ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నప రెడ్డి

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా ఎంతో విలువైన వారసత్వ సంపదకు నిలయమని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా శాఖ కన్వీనర్ లయన్ కె.చిన్నప రెడ్డి అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవ ముగింపు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందని వాటిని కాపాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇంటాక్ జిల్లా శాఖ కృషి చేస్తోందన్నారు. గండికోట, సిద్దవటం కోట, ఆదిమానవుని రేఖా చిత్రాలు, జైన బౌద్ధ శిథిలాలతోపాటు ఇక్కడి ఆహార, ఆరోగ్య వారసత్వ సంపదను కాపాడుకునేందుకు ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు గర్వకారణంగా నిలిచి ఉన్న పాత కలెక్టరేట్ ను ఆధునీకరించుకునేందుకు చేస్తున్న కృషి ఫలిస్తుందన్నారు. చరిత్ర ఉపన్యాసకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ జిల్లాలో మరెంతో విలువైన వారసత్వ సంపద ఉందని, నేటి తరం విద్యార్థులకు వాటి గురించి తెలియజేయవలసిన బాధ్యత మనదేనన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వారసత్వ సంపద గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉందన్నారు. సీనియర్ ఇంటాక్ సభ్యులు లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలను ఎంపిక చేస్తే సమీప పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. ఇంటాక్ కోకన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వారసత్వ సంపద గురించి విద్యార్థులకు క్షేత్ర పర్యటనల ద్వారా తెలియపరిస్తే మంచి ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. డాక్టర్ రంగనాథ రెడ్డి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణతో నేడు పుష్పగిరి క్షేత్రానికి విశేష ప్రాచుర్యం లభించిందన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, పాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, సభ్యులు లయన్ పి.వి. రమేష్, కల్లూరు బాల ఎల్లారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, బోగాల కొండారెడ్డి, రాఘవేంద్ర వర్మ, తిరుమల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా బిడ్డను ఆదుకోండి.!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌కుమార్

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం మంజునాథకాలనీకి చెందిన పి.ఆర్. వాసు, మంజుల దంపతుల కుమారుడు కిరణ్‌కుమార్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. తొలుత తిరుపతి ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో ఇప్పటి వరకు రూ.13 లక్షలు బిల్లు చెల్లించాలని వైద్యులు చెప్పారు. దీంతో చేసేది లేక వాసు స్థానిక ప్రెస్‌క్లబ్‌కు వచ్చి తన బాధను తెలియజేశాడు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

మహాసేనోదయంతో 'కొడవలూరు'కు విశేష కీర్తి



కవి ఏసీ దస్తగిరిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం నిర్వాహకులు

కడప కల్చరల్ : మహాసేనోదయం కావ్య రచనతో కవి కొడవలూరు రామచంద్రరాజుకు విశేష కీర్తి లభించిందని ప్రొద్దుటూరుకు చెందిన విశ్రాంత తెలుగు పండితులు ఏసీ దస్తగిరి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెల నెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్ కేంద్రంలో ఆయన కొడవలూరు రామచంద్రరాజు రచించిన ' మహాసేనోదయం' అనే కావ్యంపై ప్రసంగించారు. కుమారస్వామి జనన వృత్తాంతాన్ని 'మహాసేనోదయం' కావ్యంగా మలచి తెలుగు సాహిత్య చరిత్రలో మహాకవిగా కొడవలూరు రామచంద్రరాజు కీర్తి గడించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కవి జీవిత విశేషాలను వివరించారు. ఆయన రచనలు, అందుకున్న ప్రశంసలు, సమకాలీన కవి పండితుల సాహచర్యం గురించి తెలిపారు. కవి రామచంద్రరాజు ప్రొద్దుటూరుకు చెందిన వారని, ఆధునిక కాలంలో బంధ, గర్భ, చిత్ర కవిత్వాన్ని చెప్పిన అతి తక్కువమందిలో ఆయనొకరన్నారు. పల్లెల్లో నివసిస్తున్న సంపన్న కుటుంబీకుల పిల్లలకు చదువు చెబుతూ జీవనం సాగించారని, అలా ఆయన దగ్గర చదువుకొని, తర్వాతి కాలంలో కవులుగా ప్రసిద్ధి పొందిన వారిలో జిల్లాకు చెందిన ప్రముఖ అభ్యుదయకవి వైసీవీ రెడ్డి ఒకరన్నారు. 1910లో పుష్పగిరి పీఠం ఆస్థాన కవి అయ్యారని, నాటి పీఠాధిపతి నుంచి స్వర్ణహస్తకంకణంతో గౌరవం పొందారని వివరించారు. రామచంద్రరాజు 61 గ్రంథాలు రచించారని, అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల చాలా వరకు అచ్చుకు నోచుకోలేదన్నారు. ఆయన రచన 'మహాసేనోదయ ప్రబంధం' ఎనిమిది ఆశ్వాసాల కావ్యమని, 1932లోనే దీనిని పూర్తి చేసినా ప్రచురించలేకపోయారని చెప్పారు. అనంతరం కుమారుడు ఆ బాధ్యతను చేపట్టి ప్రచురించారని తెలిపారు. ఆయన రచనా వైదుష్యాన్ని సోదాహరణంగా వివరించారు. తొలుత బ్రౌన్ కేంద్రం నిర్వాహకులు వక్త ఏసీ దస్తగిరిని సభకు పరిచయం చేశారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక తదితరులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కొడవలూరు రామచంద్రరాజు బంధువులు, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాల కృష్ణశాస్త్రి, పుత్తా పుల్లారెడ్డి, రాజారెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు, ఎస్.నాగముని మధుబాబు, వై.ప్రభాకర రెడ్డి, సాయిబాబా, శ్యామసుందర్ రెడ్డి, కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.